# వైద్యవివాదం

పూర్వం సింహపురిలో సంజీవరాయుడనే ఆయుర్వేద వైద్యుడు ఉండేవాడు. అతనిది మంచి హస్తవాసి ! ఏ జబ్బునైన తొందరలోనే నయం చేయగల శక్తి సామర్థ్యాలు కలవాడు కాని సంజీవరాయుడుకు వేపకాయంత వెర్రి ఉండేది. అది అతని పెళ్ళాం మీద కోపం వచ్చినప్పుడు ఎక్కువవుతూ ఉండేది.

అదే ఊరిలో రత్నాచారి అనే వ్యాపారస్తుడు ఉండేవాడు. అతని ఏకైక కొడుకు పేరు ముత్యం ! ముత్యంకు పదేళ్ళు వచ్చాయి. బాగా చదువుకుంటూ వృద్ధిలోకి వస్తూ ఉన్నాడు. హఠాత్తుగా ఒక రాత్రి ముత్యం జ్వరంతో విలవిల్లాడి పోయాడు. సంధి ప్రేలాపన మొదలు పెట్టాడు. 'నాన్నా! నేను బతకను' అంటూ కలవరించసాగాడు.

రత్నాచారి కాళ్ళూ చేతులు ఆడలేదు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని సంజీవరాయుడి దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చాడు. కాని ఆ రాత్రే సంజీవరాయుడి భార్య అతనితో పోట్లాడి ఊరికెళ్ళింది. ఆ కోపంతో ఉన్నాడు.

" సంజీవా ! సంజీవా ! నా బిడ్డను మీరే రక్షించాలి" ఏడుస్తూ చెప్పాడు రత్నాచారి.

" నేనిప్పుడెవరికీ వైద్యం చెయ్యను నా మనసు బాగోలేదు" నిష్కర్షగా చెప్పేశాడు వైద్యుడు. రత్నాచారి చేసేది లేక ఎడ్లబండి కట్టించి ముత్యాన్ని తీసుకుని పొరుగూరికి వెళ్ళి అక్కడి వైద్యరత్న అయిన నరసాచారికి చూపించాడు. అతను వెంటనే వైద్యం చేశాడు.

కొన్నాళ్ళకు నెమ్మదించింది ముత్యానికి ! రత్నాచారి మటుకు ఆ అవమానం మర్చిపోలేక రాజుగారికి ఫిర్యాదు చేశాడు సంజీవరాయుడి మీద ! రాజు గారి ఎదుట ఈ వివాదం న్యాయవిచారణ కొచ్చింది.

"సంజీవా ! మీ దగ్గరికి వచ్చే వాళ్ళంతా వైద్యం కోసమే గదా వచ్చేది - అందరికీ వైద్యం చెయ్యరా?" మంత్రి ప్రశ్న. "చేస్తాను అమాత్యా ! కాని ఆ రోజు రాత్రి అయింది. కాబట్టి - బాగా అలసిపోయి - చికాకులో ఉండి చేయలేకపోయాను."

"ఒకవేళ ఆ బాలుడుకు ఏమైనా జరిగి ఉంటే ఆ పాపం ఎవరిది? మీది కాదా?"

" నాది కాదండి - వేరే ఎవరితో నైనా వైద్యం చేయించుకోమని సలహా ఇచ్చానండి"

" రత్నాచారి గారు ! మరి ఆ రాత్రి మీరేం చేశారు?"

" బండి కట్టించుకుని పది క్రోసుల దూరంలో ఉన్న నరసాచారి ఇంటికెళ్ళానండి. ఆయన విస్తుపోయారండి - సంజీవరాయుడిని ఊళ్ళో ఉంచుకుని తన దగ్గరకు వచ్చినందుకు. - ఆయన రాత్రల్లా మేలుకుని నా బిడ్డ ప్రాణం కాపాడాడండి." రత్నాచారి దీనంగా చెప్పుకున్నాడు.

" మరి ఇక నీ ఆరోపణ ఏమిటి?" మంత్రి అడిగాడు.

" అమాత్యా నాకు శక్తి ఉంది కాబట్టి బండి కట్టించుకుని పొరుగూరికి వెళ్ళగిలిగాను - అదే శక్తిలేని వాడు ఏం చేయగలిగి ఉండేవాడు? గాల్లో దీపంపెట్టి

దేవుడా నీవే దిక్కు అన్నట్లు - బిడ్డను మంచం మీద పడుకోబెట్టి తెల్లారేవరకు వేచి ఉండి - సంజీవరాయుడికోసం కాచుకుని ఉండేవాడు. ఆ సమయంలో బిడ్డ మరణించి ఉంటే ఆ పాపం ఈ వైద్యుడిదే కదా? అందుకని ఈ సంజీవరాయుడి మీద నేరం మోపుతున్నానండి. ఇతన్ని తగిన విధంగా శిక్షించండి" రత్నాచారి విన్నవించుకున్నాడు.

"అన్యాయం ! మోసం ! దగా ! కుట్ర ! నా యిష్టం. నాకిష్టం ఉంటేనే వైద్యం చేస్తాను లేకపోతే లేదు నేనా వైద్యం చేయడం నిరాకరించినంత మాత్రాన దోషిని ఎలా అవుతాను అమాత్యా ! ఇతడు నా మీద కక్ష కట్టి నిందవేస్తున్నాడు - అనుగ్రహించండి" గోల పెట్టాడు వైద్యుడు.

"అమాత్యా ! ఆ రాత్రి నేను ఎంత చిత్రవధ అనుభవించానో వర్ణశక్యం కాదు. వైద్యం చేయగలిగి ఉండి - ఇతడు ఏమాత్రం నా మీద దయచూపలేదు. ఇప్పుడు మీరు మటుకు ఇతని మీద ఎందుకు దయచూపాలి?" రత్నాచారి చెప్పాడు.

మంత్రి కాసేపు ఆలోచించాడు. రాజుగారు అతన్ని ఆసక్తితో గమనిస్తున్నాడు.

"ఆయుర్వేద వైద్యశిఖామణి అయిన సంజీవరాయుడికి ఇరవై కొరడా దెబ్బలు శిక్ష విధిస్తున్నాను. అంతే గాక నూరు బంగారు నాణెములు జరిమానా చెల్లించాలి రత్నాచారికి క్షమాపణ చెప్పుకోవాలి" మంత్రి తన తీర్పు వినిపించాడు.

రాజభటులు సంజీవరాయుడిని లాక్కు వెళ్ళారు 'అన్యాయం అక్రమం' అని విలపిస్తున్న సంజీవరాయుడి కేకలు దూరంగా వినిపిస్తున్నాయి.

రాజు సంభ్రమంలో పడిపోయాడు.

"దేవరవారు ఏదో ఆలోచిస్తున్నట్లు ఉంది" మంత్రి అన్నాడు.

"అమాత్యా ! మీ న్యాయ నిర్ణయం నాకు వింతగా ఉంది!"

"దీనిలో వింత ఏముంది ప్రభూ ! ప్రాణాలు కాపాడవలసినవాడు వైద్యుడు. ఆ వృత్తి స్వీకరించిన నాడే తన శక్తి మేరా రోగుల ప్రాణాలు కాపాడుతానని ప్రమాణం చేస్తాడు వైద్యుడు".

"కాని ... వైద్యునికి తన రోగిని ఎన్నుకునే అర్హత లేదా?"

"లేదు ప్రభూ ! వేరే వ్యాపారికి తన కొనుగోలుదారునిని ఎన్నుకునే హక్కున్నట్లు ఇతనికి లేదు యాచించిన రోగికి తనకు చేతనైన వైద్యం చేయవలసిందే ! తిరస్కరించి నట్లయితే తను వృత్తిలో దిగేముందు చేసిన ప్రమాణాన్ని భంగం చేసిన వాడవుతాడు గాలి, నీరు లాగానే వైద్య, కూడ అత్యవసర వస్తువు దాన్ని తిరస్కరించకూడదు" మంత్రి వివరించాడు.

"భేష్ ! మంత్రి ! భేష్ ! నిర్లక్ష్యం ప్రదర్శించిన వైద్యునికి తగిన శాస్తి చేసి మా ఆస్థానం పరువు కాపాడావు!" అని రాజు మంత్రిని పొగిడాడు.

"అంతే కాదు ! చేతనైన సహాయం చెయ్యనివాడు కూడ శిక్షార్హుడే అని నిరూపించావు" అని ప్రశంసించాడు రాజు.

"వైద్యో నారాయణో హరిః అన్నారు. అందుకని అతనికి ఈ శిక్ష తప్పనిసరి దేవరా ! ఎవరు ఎలాంటి ఆపదలో ఉన్నా రక్షించడం మానవ ధర్మం ! కాపాడగలిగి ఉండి కాపాడకపోవడం నేరం!" అని వినయంగా చెప్పాడు మంత్రి.